క్లుప్తంగా

మంచాల జ్ఞానేందర్‌కు అయ్యప్ప సేవారత్న పురస్కారం



సుభాష్‌నగర్: మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనేక సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే, మరోవైపు దేశ భక్తి కలిగిన మంచాల జ్ఞానేందర్‌కు అయ్యప్ప స్వామి జయంతి, ఐక్యవేదిక ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఈసీఐఎల్‌లో జరిగిన కార్యక్రమంలో శ్రీ అయ్యప్ప సేవా రత్న పురస్కారాన్ని ఆదివారం ప్రదానం చేశారు. శ్రీశ్రీశ్రీ విద్యా శంకర భారతి స్వామి వారు మంచాల జ్ఞానేందర్‌కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు, దేశ భక్తి కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి సేవా సమితి ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



నిజామాబాద్‌అర్బన్: జవహర్ నవోదయ ఫలితాల్లో నగరంలో హైఫై కోచింగ్ సెంటర్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు రవి వర్మ ఓ ప్రకటనలో తెలిపారు. వర్షిత్ వర్మ, మృణాల్‌రెడ్డి, జోయెల్, వర్షిత్, జయరాం, ప్రణీత్‌లు ఉత్తమ ఫలితాలు సాధించి నవోదయ పాఠశాలకు ఎంపికయ్యారు. ప్రతి ఏటా ఎంతో మంది విద్యార్థులు నవోదయ, సైనిక్ పాఠశాలలకు ఎంపికవుతున్నట్లు ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరికలు

సిరికొండ: మండలంలోని కొండూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని పీసరగుట్ట తండాకు చెందిన బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే భూపతిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో ఆదివారం చేరారు. యూత్ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి ఆధ్వర్యంలో తండావాసులు తిరుపతి, లక్ష్మణ్, హరి, గణపతి, మహిపాల్, నాసీలాల్, గణేష్ తదితరులు పార్టీలో చేరారు.

నేత కార్మికులకు పని కల్పించాలి

బోధన్: చేనేత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కార్మి కులకు పని కల్పించాలని సంఘం సభ్యులు కోరా రు. బోధన్ చేనేత సహకార సంఘం 72వ మహాజన సభ ఆదివారం సంఘం అధ్యక్షుడు మోత్కూరి నారాయణ అధ్యక్షతన నిర్వహించారు. సభ్యులు మాట్లాడుతూ.. సంఘంలో ఉత్పత్తి చేస్తున్న బెడ్ షీట్ విక్రయానికి రుద్రూర్‌లో వస్త్ర విక్రయశాల ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్‌లో డిమాండ్ ఉ న్న లుంగీలు, టవల్స్ తదితర వస్త్రాలు కొనుగోలు చేసి బెడ్ షీట్‌లతో పాటు వీటిని విక్రయించాలని తీర్మానించారు. చేనేత కార్మికులకు ప్రభుత్వ పథకాలు వర్తించేటట్టు చూడాలని, సంఘానికి రావాల్సిన అద్దె బకాయిలు పెండింగ్‌లో పెట్టకుండా వ సూలు చేయాలని సిబ్బందికి సూచించారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షుడు గోనె దత్తాత్రి, డైరెక్టర్లు నూత్పల్లి గణేష్, లోకం భూమయ్య, గంగుల శంకర్, పుల్లె లక్ష్మీ, సంఘం మేనేజర్ ఈర్వ నాగరాజు, కార్యదర్శి అంకం నర్సింలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల ప్రచారం

డొంకేశ్వర్(ఆర్మూర్): గంగాసముందర్ గ్రామంలో బీజేపీ నాయకులు ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడారు. కరపత్రాలు పంచుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి పార్టీని గెలిపించాలని కోరారు. ప్రధానిగా నరేంద్ర మోదీ నాయకత్వం దేశానికి అవసరమన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోతుగంటి సురేందర్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యాక్షుడు మారంపల్లి గంగాధర్ పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత

బాల్కొండ : మెండోరా మండల కేంద్రానికి చెందిన స్రవంతి అనే బాలిక చెవి చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.4 లక్షల 50 వేలను డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి మంజూరు చేయించారు. అందుకు సంబంధించిన ఎల్‌వోసీ కాపీని ఆదివారం ఆమె కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కొత్తింటి ముత్యం రెడ్డి, నాయకులు రవి, రమేశ్, మహేందర్, అశోక్, అనిల్, నవీన్, సాయిరాం, శంకర్, జీవన్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

వేల్పూర్: జాన్కంపేట్ ప్రైమరీ స్కూలులో అటెండర్‌గా 40 ఏళ్లు పనిచేసి ఇటీవల అనారోగ్యంతో మరణించిన చేంగల్‌వాసి బట్టు పెద్ద బాలయ్య కుటుంబానికి ఆదివారం స్థానిక ఎస్సీ సంఘం సభ్యులు రూ.12 వేల ఆర్థిక సహాయం అందజేశారు. చాలా ఏళ్లు పనిచేసినా ఆయన కుటుంబం నిరుపేద స్థితిలో ఉండడంతో తమవంతు తోడ్పాటు అందించాలని సహాయం చేశామన్నారు. గ్రామస్తులు కూడా ఇటీవల రూ.40,500 నగదు అందించారు. సభ్యులు సొడ ప్రభాకర్‌రావు, తలారి శేఖర్, ఎడ్ల సిరిల్‌రావు, తలారి కిషన్ పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రెయినేజీ

- రోడ్లపై పారుతున్న మురుగు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కెనాల్‌కట్ట ప్రాంతంలో దుస్థితి
- పట్టించుకోని అధికారులు

కార్పొరేషన్ రిపోర్ట్



కెనాల్‌కట్ట ప్రాంతంలో అధ్వానంగా ఉన్న మురుగు కాలువ

నిజామాబాద్ నాగారం : నగరంలోని 40వ డివిజన్‌లో వసతులు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. డివిజన్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా మారింది. రోడ్లు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. పేదల కాలనీ కావడంతో ప్రజాప్రతినిధులు, అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. డ్రెయినేజీ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్లపై పారుతోంది. 40వ డివిజన్‌లోని కెనాల్ కట్ట ప్రాంతంలో సామన్య పేద ప్రజలే ఎక్కువగా నివస్తున్నారు. చిన్న చిన్న ఇళ్లలో జీవనం సాగిస్తున్నారు. రోడ్లు కూడా చిన్నగా ఉన్నాయి. ఈ ప్రాంతంలో డ్రెయినేజీ వ్యవస్థ లేదు. అత్యంత దారుణంగా తయారైంది. డ్రెయినేజీ కాలువ మాదిరిగా ప్రవహిస్తుంది. ఖాళీ ప్రదేశాల్లో మురుగు నిలిచి కంపు కొడుతోంది. డ్రెయినేజీలో చెత్త చెదారం అంతా ఉంటుంది. దీంతో డ్రెయినేజీ నీరు ఒకే ప్రాంతంలో నిలువ ఉంటుంది. భరించలేని దుర్వాసన వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమల బెడదతో రోగాలు

డ్రెయినేజీ నీరు ఎక్కడిక్కడ నిల్వ ఉండడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. రాత్రి పగలు తేడా లేకుండా దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. దోమకాటుతో కాలనీవాసులు రోగాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాల్సి ఉన్న సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు. శానిటేషన్ అధికారులు కనీసం ఈ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. కొత్తగా డ్రెయినేజీలు నిర్మించాలని, అప్పటి వరకు నిత్యం శుభ్రం చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సంబంధాలను మెరుగుపర్చుకోవాలి

- అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి



పరిచయ వేదికలో పేర్లు నమోదు చేసుకుంటున్న తల్లిదండ్రులు



మాట్లాడుతున్న సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి

నిజామాబాద్‌నాగారం: ప్రతి ఒక్కరు సత్సంబంధాలు కలిగి ఉండి సంఘాలతో మమేకమైతే బంధాలు మెరుగుపర్చుకోవచ్చునని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో 6వ పద్మశాలి వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమం సంఘం సెంట్రల్ బోర్డు సభ్యులు దాసరి నర్సింహులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా కందట్ల స్వామి హాజరై మాట్లాడారు. తల్లిదండ్రులు, బంధు మిత్రులతో మంచి సంబంధాలు పెట్టుకొని ప్రతి కార్యక్రమాలకు వెళితే బంధాలు, పరిచయాలు పెరుగుతాయన్నారు. తల్లిదండ్రులు ఆధునిక పోకడలకు పోకుండా సరైన సమయంలో వివాహాలు చేసి కుటుంబంతో ఆనందంగా ఉండాలన్నారు. ఈ కాలంలో అమ్మాయిలు దొరకడం లేదన్నారు. రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు కమర్తపు మురళి మాట్లాడుతూ.. దాసరి నర్సింహులుకు 85 ఏళ్లు వచ్చినా పరిచయ వేదికలు పెట్టి పద్మశాలీలకు సేవలు చేయడం ఎంతో గొప్ప విషయమన్నారు. వారికి మనమందరం అండగా ఉండాలన్నారు. అంతకు ముందు తల్లిదండ్రులు అమ్మాయి, అబ్బాయిల పేర్లు నమోదు చేసుకున్నారు. 500 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బోగ అశోక్, విశిష్ట అతిథులు, పద్మశాలీలు పాల్గొన్నారు.

రూ.40 కోట్ల ఆస్తి పన్ను వసూలు

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను బకాయిలు రూ.40 కోట్ల వరకు వసూలయ్యాయి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిల కోసం అధికారులు ఉద్యోగులు సిబ్బంది కలిసికట్టుగా శ్రమించారు. రూ.42 కోట్ల టార్గెట్‌తో ముందుకెళ్లారు. ఆర్థిక సంవత్సరం ముగింపు చివరి రోజు ఆదివారం వరకు రూ.40 కోట్ల వరకు ఆస్తి పన్ను బకాయిలు వసూలైనట్లు డిప్యూటీ కమిషనర్ రాజేంద్ర కుమార్ తెలిపారు.

నేడు పోలింగ్ బీఎల్‌వోలకు ప్రత్యేక శిక్షణ

నిజామాబాద్ నాగారం: నిజామాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 289 పోలింగ్ బూత్ ఆఫీసర్లకు సోమవారం ఉదయం 10 గంటలకు పాలిటెక్నిక్ కళాశాలలో ప్రత్యేక శిక్షణ ఉంటుందని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మకరందు ఆదివారం తెలిపారు. బూత్ లెవెల్ ఆఫీస్ అందరూ హాజరు కావాలన్నారు.

ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణమే



నిజామాబాద్ రూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సాధారణమేనని మాధవనగర్ సాయి బాబా ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ గుప్తా అన్నారు. ఆదివారం ఆలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొండుక గంగాధర్ పదవీ విరమణ కార్యక్రమాన్ని ఆలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబా ఆలయ ఈవో మాట్లాడుతూ.. దైవ సన్నిధిలో ప్రభుత్వ ఉద్యోగిగా పని చేసి పదవీ విరమణ పొందడం అదృష్టం అన్నారు. అనంతరం గంగాధర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

కాంగ్రెస్ పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రవి నియామకం



ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రవి

జక్రాన్‌పల్లి: జక్రాన్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా తొర్లికొండకు చెందిన కనక రవి నియమితులయ్యారు. ఈ మేరకు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే భూపతిరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో ఎస్సీలందరిని ఐక్యంగా కలుపుకునిపోయి కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు లింగం, మండల ఉపాధ్యక్షుడు ఉత్కం శ్రీనివాస్‌గౌడ్, మండల యూత్ అధ్యక్షుడు సొప్పరి వినోద్, రూరల్ అధ్యక్షుడు నరేష్, కిషోర్, వినోద్, కిరణ్ అనుపాల, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిజామాబాద్‌నాగారం: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-1 ఏడీఈ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు కరెంట్ ఉండదన్నారు. నగరంలోని న్యాల్‌కల్ చౌరస్తా, సూర్యనగర్, చంద్రనగర్, కోటగల్లీ, హనుమాన్‌నగర్, పద్మానగర్ రోడ్ 1 నుంచి 4 వరకు, యాదగిరిబాద్, రిలయన్స్ మాల్ వెనుక, విజయలక్ష్మి గార్డెన్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో కరెంట్ ఉండదన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా నల్లపోచమ్మ బోనాల పండుగ



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మంచిప్ప గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నల్ల పోచమ్మ బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి బోనాలతో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలు బాగా పండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామస్తులు ప్రార్థించారు. భక్తి శ్రద్ధలతో ప్రజలు నల్ల పోచమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, యువకులు, అన్ని కుల సంఘాల సభ్యులు, మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

మహర్షి దయానంద సరస్వతి జయంతి ఉత్సవాలు



నిజామాబాద్ సిటీ: నగరంలోని ఆర్యసమాజంలో ఆదివారం మహర్షి దయానంద సరస్వతి ద్విశతాబ్ది 200వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా 100 జంటలతో 51 యజ్ఞ కుండీయ గాయత్రీ మహాయాగం జరిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏపీ, తెలంగాణ ఆర్య ప్రతినిధి సభ ప్రధాన్ ప్రొఫెసర్ విఠల్‌రావు ఆర్య మహర్షి దయానంద సరస్వతి వేద ప్రచారానికి చేసిన కృషిని వివరించారు. అనంతరం వేదోద్ధారకుడు మహర్షి దయానంద సరస్వతి సంక్షిప్త సచిత్ర జీవన చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించి వితరణ చేయించారు. విశిష్ట అతిథి, మెదక్ జిల్లా ఆర్షోధ సంస్థాన్ అలియాబాద్ సుశ్రీ ఆచార్యా నీరజ మాతాజీ మాట్లాడుతూ.. ఆదర్శవంతులైన యువతను తయారు చేయాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. కామారెడ్డి అర్ష గురుకుల స్వామి బ్రహ్మనంద సరస్వతి మాట్లాడుతూ.. పిల్లలను పెంచి పోషించటంలో తల్లిదండ్రుల బాధ్యత గురించి వివరించారు. మానవ నిర్మాణంలో తల్లి పాత్ర ఎంతో కీలకమని, తల్లి వద్ద అన్ని విషయాలు నేర్చుకోవాలన్నారు. యజ్ఞ బ్రహ్మగా శ్రీ ఆచార్య వేదమిత్ర వేదార్థి యజ్ఞాన్ని విజయవంతంగా నిర్వహించారు. భజనోపదేశకులు ప్రణవకుమార ఆర్షకవి, కొత్తపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



రేణుక మాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

నిజామాబాద్ సిటీ: నగరంలోని వివేకానంద కాలనీలో ఆదివారం కార్యసిద్ధి రేణుక ఎల్లమ్మ సహిత మానసాదేవి మందిరంలో రేణుక మాత విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ గుజ్జ రాజేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి నగర మేయర్ దండు నీతూ కిరణ్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. గత నాలుగు సంవత్సరాలుగా రేణుకా మాత ఆలయంలో అనేక కార్యక్రమాలు నిర్వహించటం సంతోషంగా ఉందన్నారు. సోమవారం(నేడు) జరిగే విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆలయ కమిటీ చైర్మన్ గుజ్జ రాజేశ్వరి మాట్లాడుతూ.. మానసా దేవి నిజమైన పుట్ట ఉండడం వల్ల భక్తులకు కొంగుబంగారంగా ఈ దేవాలయం విలసిల్లుతుందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు గుజ్జ బాలమల్లు,7, 45 డివిజన్ల కార్పొరేటర్లు సుక్క మధు, ఆకుల హేమలత, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గల్లంతు ఖాయం

- అన్నివర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉంది
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి



పార్టీలో చేరిన ఎంపీటీసీలతో భూపతిరెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరశివారులోని రూరల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో సింగంపల్లి, నర్సింగ్‌పల్లి ఎంపీటీసీలు రమేష్, రాములుతోపాటు పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే భూపతిరెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నామరూపాలు లేకుండా పోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల్లో అమల్జేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అత్యధిక స్థానాలు విజయం సాధిస్తుందన్నారు. కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి రావడం ఖాయమని, రాహుల్‌గాంధీ ప్రధాని అవుతారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆరు గ్యారెంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారెంటీలను అమలు చేస్తున్నామని, ఏక కాలంలో రుణమాఫీకి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బోర్గాం శ్రీనివాస్, సుద్దులం శ్రీనివాస్, సాయిలు, కెతావత్ మోహన్, అంబర్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు





నడిపల్లి సీఎస్‌ఐ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు, ఏసు సందేశం వినిపిస్తున్న పాస్టర్ స్టీవెన్

డిచ్‌పల్లి: నడిపల్లి సీఎస్ఐ చర్చి, బర్దిపూర్ సీఎస్ఐ వెస్లీ చర్చి, ధర్మారం(బి) లూర్థు మాత చర్చితో పాటు వివిధ గ్రామాల్లోని చర్చిలలో ఆదివారం క్రైస్తవులు ఈస్టర్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఫాస్టర్ రెవరెండ్ ఎం.స్టీవెన్ కుమార్, పాస్టర్ దినకర్, పాస్టర్ జోసెఫ్ తదితరులు ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసు క్రీస్తు ప్రభువు మానవాళి కోసం సిలువపై మరణించి మూడు రోజుల తర్వాత తిరిగి లేచి ప్రపంచ మానవాళికి శాంతిని అందించారని దైవసందేశం వినిపించారు. కార్యక్రమంలో చర్చి పెద్దలు శామ్యూల్, రత్నకుమార్, డానియెల్, విజయ్‌కాంత్, ధన్‌రాజ్, వి.ప్రసాద్, నీరడి పద్మారావు, దేవరాజ్, ప్రకాశం, పాలు, సంఘ విశ్వాసులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి పరిధిలో..



నిస్సీ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

జక్రాన్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఘనంగా జరుపుకున్నారు. బ్రాహ్మణ్‌పల్లిలోని నిస్సీ ప్రార్థన మందిరం, జక్రాన్‌పల్లి మన్నారార్ చర్చిలలో ఈస్టర్ డేను నిర్వహించారు. క్రీస్తు బోధనలతో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విద్యా సాగర్, వినయ సాగర్, షడ్రక్ యోహాన్, గంగామోహన్, క్రైస్తవులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలతో సోదరభావం

- ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోటీలు



క్రీడాకారులతో మాట్లాడుతున్న వేణురాజ్

తెయూ(డిచ్‌పల్లి): క్రీడా పోటీలతో విద్యార్థుల మధ్య సోదర భావం పెంపొందుతుందని నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా(ఎన్ఎస్‌యూఐ) జిల్లా అధ్యక్షుడు వేణురాజ్ పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ 53వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ యూనివర్సిటీలో ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా జరుగుతున్న క్రీడా పోటీల్లో ఆదివారం ముఖ్య అతిథిగా వేణురాజ్ పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమేనన్నారు. వర్సిటీ ఎన్ఎస్‌యూఐ కమిటీ విద్యారంగ సమస్యలపై పోరాటంతో పాటు ఇలాంటి క్రీడాపోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వర్సిటీ ఎన్ఎస్‌యూ అధ్యక్షుడు కొమిర శ్రీశైలం, జిల్లా ఉపాధ్యక్షుడు నిఖిల్ రెడ్డి, సభ్యులు సాగర్ నాయక్, రాజేందర్, మహేష్ కుమార్, నిరంజన్, విజయ్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు. క్రికెట్ ఫైనల్ మ్యాచ్‌లో తెయూ ఇంటిగ్రేటెడ్ పీజీ టీం, పీజీ టీం తలపడగా ఇంటిగ్రేటెడ్ టీం విజయం సాధించింది.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



నిజామాబాద్ రూరల్: సారంగాపూర్‌లోని దాసాంజనేయ ఆలయాన్ని నూతనంగా నిర్మించడానికి గ్రామ అభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి పాత విగ్రహాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	69,000	వెండి (కిలో)	79,000
22 క్యారెట్స్	63,640		

– నిజామాబాద్ బిజినెస్

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	30	50
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	35	60	దోసకాయ	15	30
దొండకాయ	20	40	ఆలుగడ్డ	16	30
జిల్లిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	40	60	గోబిపువ్వు	30	50
వంకాయ	40	60	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	50	70
కొత్తిమీర	40	60	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	40	60
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.45, 1.40, 4.35, 7.30, 10.25
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు) - 10.45, 1.50, 4.25, 10.25, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 7.30
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 1.15, 7.25, 10.40, కలియుగం పట్టణంలో (తెలుగు) - 4.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 10.10, 1.10, 7.50, 10.50, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 4.20
స్క్రీన్-2	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-తెలుగు) - 12.00, 2.40, గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (3డీ-ఇంగ్లీష్) - 5.20, 8.00, 10.40
స్క్రీన్-3	ది గోట్ లైఫ్ (తెలుగు) - 12.05, 7.00, రజాకార్ (తెలుగు) - 3.45, ఓం భీమ్ బుష్ (తెలుగు) - 10.40
స్క్రీన్-4	క్రూ (తెలుగు) - 10.45, 1.35, 7.40, 10.30, ప్రేమలు (తెలుగు) - 4.25
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు)
నటరాజ్	గాడ్జిల్లా ఎక్స్ కాంగ్ (తెలుగు)
లలితామహల్	ఓం భీమ్ బుష్ (తెలుగు)
విజయ్	రజాకార్ (తెలుగు)